న్యూస్‌రీల్

కూపర్‌లింగుస్వామి జాతర పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీటీడీవో నీలిమ

కాసిపేట: మండలంలోని కుర్రేఘాట్‌లో నిర్వహించే గొండిధర్మగురు జైశ్రీ అహండి కూపర్ లింగుస్వామి జాతర మహాపూజ పోస్టర్‌ను జిల్లా కేంద్రంలో డీటీడీవో నీలిమ ఆవిష్కరించారు. ఈ నెల 21నుంచి 23వరకు కుర్రేఘాట్ అటవీ ప్రాంతంలో భక్తిశ్రద్ధలతో జాతర నిర్వహించనున్నట్లు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా కోరారు. జాతర నిర్వహణ కమిటీ, ఆదివాసీ నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరించండి

భీమారం: మండల కేంద్రంలోని ఇప్పలబొగుడలో సర్పంచ్ గద్దె రాంరెడ్డి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. నెల రోజుల నుంచి నీరు రావడంలేదని, అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని స్థానికులు ప్రశ్నించారు. వెంటనే నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మిషన్ భగీరథ పైపులు ధ్వంసం కావడంతో నీరు రావట్లేదని, సంబంధిత అధికారులకు మరమ్మతు చేపట్టాలని కోరినట్లు తెలిపారు. నీరు వచ్చేంత వరకు వాటర్‌ట్యాంకర్ ద్వారా నీటిని అందించనున్నట్లు హమీ ఇచ్చారు. జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన సెంట్రల్‌లైటింగ్‌పై యువకులు ప్రశ్నించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వేముల శ్రీనివాస్‌తో పాటు వార్డుసభ్యులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 28న సైన్స్ సెమినార్

మంచిర్యాలఅర్బన్: జాతీయసైన్స్ దినోత్స వం సందర్భంగా ఉపాధ్యాయులకు ఫిబ్రవరి 28న దేశాన్ని స్వావలంబనగా మార్చటానికి సైన్స్ సంస్కృతిని ప్రోత్సహించటం అనే అంశంపై సెమినార్ నిర్వహిస్తున్నట్లు డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. జనవరి 19న మధ్యాహ్నం 11 నుంచి 1గంట వరకు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, క్షేత్రస్థాయి కార్యకర్తలతో సెమినార్ పేపర్‌ను ఎలా సిద్ధం చే యాలనే అంశంపై టెలీకాన్ఫరెన్స్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని సైన్స్ ఉపాధ్యాయులు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

11 నుంచి టీసీసీ అభ్యర్థులకు పరీక్షలు

మంచిర్యాలఅర్బన్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) పరీక్షకు 2021–22 సంవత్సరంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఫిబ్రవరి 11 నుంచి 14 వరకు పరీక్షలు నిర్వహిస్తామని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. డ్రాయింగ్‌లోయర్, హైయర్‌గ్రేడ్ టైలరింగ్, ఎంబ్రాయిడరీ పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్‌టికెట్‌ల ను www.bsetelangana.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

సినిమా డైరెక్టర్‌కు సన్మానం

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్టులో మంచిర్యాలకు చెందిన 'వద్దుకట్నం' సినిమా డైరెక్టర్ గొట్టిముక్కల భార్గవ్‌ను ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల నాయకులు పూలమాలలు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నేతకాని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్కూరి రాయమల్లు, బీసీ సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నీలకంఠేశ్వర్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ నేరేళ్ల వెంకటేష్, ఆదివాసీ సంఘం జిల్లా అధ్యక్షులు కోవ జంగు తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

నస్పూర్: పట్టణంలోని పలు సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూములు కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సంఘం నాయకులు మంగళవారం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ జ్యోతికి సమర్పించారు. కార్యక్రమంలో టీవీయూవీ రాష్ట్ర కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్, ఎన్ఎస్‌సీ జిల్లా అధ్యక్షుడు పూరెల్ల నితీష్, వీజేఎస్ జిల్లా అధ్యక్షుడు బచ్చల ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



చెన్నూర్: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో సంక్రాంతి సెలవులను పురస్కరించుకొని నిర్వహించిన 'బాల్క' ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు మంగళవారం ముగిశాయి. పోటీల్లో ఫైనల్ మ్యాచ్‌లో కేజీఎం ఎలెవన్, రుద్ర ఎలెవన్ జట్లు తలపడ్డాయి. కేజీఎం ఎలెవన్ జట్టు విజేతగా నిలువగా రన్నర్‌గా రుద్ర జట్టు నిలిచింది. గెలుపొందిన విజేతలకు ట్రోఫీలను మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చన రాంలాల్‌గిల్డా, నిర్వహకులు కౌన్సిలర్ తుమ్మ రమేశ్ అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నవాజ్, మాజీ సర్పంచ్ కృష్ణ, కౌన్సిలర్లు కమ్మల శ్రీనివాస్, అనిల్, సతీశ్, ఆయుబ్, కారెంగుల రామయ్య, నాయిని సతీశ్, కొండపర్తి వెంకటరాజం, సురేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దడపుట్టిస్తున్న గ్రామసింహాలు



దండేపల్లి: మండల కేంద్రంతో పాటు, మండలంలోని పలు గ్రామాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. రోడ్ల వెంట గుంపులు గుంపులుగా తిరగడంతో పిల్లలు, పెద్దలు రోడ్ల వెంట నడిచేందుకు భయాందోళన చెందుతున్నారు. నెల రోజుల వ్యవధిలో సుమారు 30కి పైగా పశువులు కుక్కకాటుకు గురైనట్లు పశువైద్యాధికారి ధన్‌రాజ్ తెలిపారు. దండేపల్లిలో బొమ్మెన మహేష్‌కు చెందిన రెండు గేద దూడలు కుక్కకాటుతో మృత్యువాత పడ్డాయి. దీంతో కుక్కల బెడదను తీర్చాలని ప్రజా ఫిర్యాదుల విభాగంలో, గ్రామ సభలో ఫిర్యాదులు వెల్లువెత్తాయి.

మట్టి ఇలా.. వెళ్లేదెలా..!

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని రెండో జోన్‌లో గల రైల్వే స్టేషన్ రోడ్డులో ప్రభుత్వ పాఠశాల ఎదుట గల్లీ కాలువపై నూతనంగా కల్వర్టు నిర్మించారు. కల్వర్టును నిర్మించిన అధికారులు మట్టి తొలగించక పోవడంతో ఆ గల్లీలోకి వెళ్లడానికి, స్టేషన్ రోడ్డుపై నుంచి వెళ్లే వాహనాలకు ఇబ్బంది కలుగుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇబ్బందులు తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



అటెన్షన్ ప్లీజ్.. ఫుట్‌పాత్ ధ్వంసం..!



భీమారం: మండల కేంద్రంలోని జాతీయరహదారిలో నిర్మించిన ఫుట్‌పాత్ మూడు నెలలకే ధ్వంసమైంది. మంచిర్యాల–చెన్నూరు జాతీయరహదారి విస్తరణలో భాగంగా రెండు వరసలు ఉన్న రహదారిని నాలుగు వరసలుగా నిర్మించిన జాతీయ రహదారుల శాఖ పక్కనే ఫుట్‌పాత్‌ని టైల్స్‌తో ఏర్పాటు చేశారు. పనుల్లో నాణ్యత లేకపోవడంతో టైల్స్ ధ్వంసమయ్యాయి. అధికారులు ఈ విషయంలో చర్యలు తీసుకొని ఆ ఫుట్‌పాత్‌ని తొలగించి కొత్తగా ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

సంబంధిత అధికారి : అన్నయ్య, డీఈఈ, నేషనల్ హైవేస్ ఫోన్ నంబర్ : 73826 25560

నాటక రంగాన్ని ప్రోత్సహించాలి

- జీఎం సంజీవరెడ్డి


కళాకారులను సన్మానిస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: ప్రతి రంగంలో జీవిస్తున్న వారు నాటక రంగాన్ని ప్రోత్సహించాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలో రెండు రోజులు పాటు శ్రీసాయి సంతోషి నాట్య మండలి ఆధ్వర్యంలో జరిగిన సురభి నాటకోత్సవం సోమవారం రాత్రి ముగిసింది. దీనికి జీఎం ముఖ్య అతిథిగా హాజరై ప్రదర్శనలిచ్చిన కళాకారులను అభినందించారు. కళాకారులు తమ కళకు ప్రాణం పోశారని, నేటి తరం యువత ఈ నాటక రంగాన్ని చూడటం ద్వారా మన పురాణ, ఇతిహాసాల గురించి తెలుస్తాయన్నారు. మాయాబజార్, శ్రీకృష్ణలీలలు, బాల నాగమ్మ, సమ్మక్క సారలమ్మ నాటికలు అలరించాయన్నారు. అనంతరం కళాకారులను జీఎం దంపతులు సన్మానించారు. కార్యక్రమంలో జీఎం సతీమణి, ఏరియా సేవా అధ్యక్షురాలు రాధాకుమారి, గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏరియా ఎస్‌ఓటూ జీఎం త్యాగరాజు, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షులు అబ్దుల్‌ఖాధీర్, ఏజెంట్ గోపాల్‌సింగ్, గనుల మేనేజర్లు తిరుపతి, స్వామిరాజు, టీబీజీకేఎస్ ఫిట్ సెక్రెటరీ పీవీ రావు, నాయకులు బుస్స రమేశ్ పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ చీటీలు ఇవ్వాలని ధర్నా


ధర్నా చేస్తున్న నాయకులు

రామకృష్ణాపూర్: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సీఎంపీఎఫ్ చీటీలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఐఎఫ్‌టీయూ అనుబంధ కాంట్రాక్ట్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సివిల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా ఐదు సంవత్సరాలుగా కార్మికులకు సీఎంపీఎఫ్ చీటీలు ఇవ్వటం లేదన్నారు. దీంతో వారికి ఎంత వేతనం చెల్లిస్తున్నారో తెలియటం లేదన్నారు. అలాగే ప్రతీ నెల 7న జీతాలు చెల్లించాల్సి ఉండగా సకాలంలో చెల్లించటం లేదన్నారు. సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. నాయకులు గజ్జి మల్లేష్, శంకర్, వెంకటేష్, నిరంజన్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

ఎస్ఎస్ఎఫ్ చెక్కుల పంపిణీ

శ్రీరాంపూర్: ఎస్సార్పీ 3గనిలో వివిధ కారణాలతో మృతి చెందిన పలువురు కార్మిక కుటుంబాలకు మంగళవారం కంపెనీ సోషల్ సెక్యూరిటీ ఫండ్ చెక్కులను అందించింది. వీ. కృష్ణారెడ్డి, బేర లక్ష్మయ్య, ముద్దసాని శంకరయ్య, గుమ్మడి మల్లేశ్, కంద్ర అనిల్‌కుమార్, జంబిగా వాసు కుటుంబాలకు ఈ మొత్తాలను చెక్కు రూపంలో గ్రూప్ ఏజెంట్ గోపాల్‌సింగ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో గని మేనేజర్ సంతోశ్‌కుమార్, గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, అధికారులు మర్రి రమేశ్, ప్రేంకుమార్, పూర్ణచందర్, ఫిట్ సెక్రెటరీ గోపాల్, నాయకులు భాస్కర్, వీరమల్లు, సారయ్య పాల్గొన్నారు.

భద్రతపై అవగాహన

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట–2 గనిపై భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం జాన్ ఆనంద్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జనవరి 16నుంచి 31వరకు భద్రత అవగాహన పక్షోత్సవాల్లో భాగంగా గనిలో పని స్థలాల్లో ఉద్యోగుల వ్యక్తిగత భద్రత, బాధ్యతలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మందమర్రి ఏరియా సేఫ్టీ జీఎం ఓదెలు, కుర్మ రాజేందర్, ఎస్‌ఓఎం ఎస్ఎంటీసీ విజయ్‌కుమార్, మేనేజర్ రవీందర్, కార్మిక సంఘాల నాయకులు తిరుపతి, గొల్ల శ్రీనివాస్, రక్షణాధికారి సంతోష్‌రావు, ఇంజనీర్లు, అధికారులు, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల్లో మొక్కలను సంరక్షించాలి


సోమగూడం(కె)లో నర్సరీ పరిశీలిస్తున్న ఎంపీడీవో


కోటపల్లి: పరిశీలిస్తున్న ఎంపీడీవో భాస్కర్

కాసిపేట: నర్సరీల మొక్కలపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ కాపాడుకోవాలని ఎంపీడీవో ఎం.ఏ.ఆలీం పంచాయతీ కార్యదర్శులు, వన సేవలకు సూచించారు. మండలంలోని లంబాడితండా(కె), సోమగూడం (కె) గ్రామపంచాయతీల్లో మంగళవారం నర్సరీలు, పల్లెప్రకృతివనాలను పరిశీలించి నర్సరీల్లో గడ్డి లేకుండా చేసి మొక్కలకు నీరు పట్టాలని, చెడిపోయిన మొక్కల స్థానంలో వేరే మొక్కలు నాటాలన్నారు.

కోటపల్లి: పంచాయతీల్లో చేపడుతున్న నర్సరీల నిర్వహణ పకడ్బందీగా ఉండాలని ఎంపీడీవో భాస్కర్ సూచించారు. ఎసన్‌వాయి, ఎడగట్ట గ్రామ పంచాయతీల్లోని నర్సరీ పనులను మంగళవారం పరిశీలించి బ్యాగ్ ఫిల్లింగ్, ఉపాధిహామీ కూలీల హాజరుశాతంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నర్సరీల్లో ఏపీ మొక్కలు పెంచాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు వివరించారు. పనులు త్వరగా పూర్తి చేసి నర్సరీల్లో మొక్కలను సంరక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ సీమా నాయక్ పాల్గొన్నారు.

'కంటి వెలుగు' సద్వినియోగం చేసుకోవాలి

- ప్రభుత్వ విప్ బాల్క సుమన్

చెన్నూర్: ఈ నెల 19 నుంచి ప్రారంభమయ్యే రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ సూచించారు. నియోజకవర్గంలోని కంటి వెలుగు కేంద్రాలను వెల్లడించారు. నియోజకవర్గంలో 11కేంద్రాల్లో అధికారులు ఏర్పాట్లు చేశారని తెలిపారు. చెన్నూర్ మున్సిపాలిటీలోని 1వార్డు పరిధిలో గల బ్రాహ్మణ సేవా సంఘం, మందమర్రి మున్సిపాలిటీలోని పద్మశాలి భవనం, రామకృష్ణాపూర్ మున్సిపాలిటీలోని డీవినిటీ పాఠశాల, చెన్నూర్ మండలం అగ్రాజుపల్లి రైతువేదిక, క్యాతన్‌పల్లిలో ప్రభుత్వ పాఠశాల, జైపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బెజ్జల గ్రామ పంచాయతీ భవనం, కోటపల్లి మండలంలోని సర్వాయిపేటలోని కమ్యూనిటీ హాల్, వెంచపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రం, భీమారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ భవనం, మందమర్రి మండలం అదిల్‌పేట ప్రభుత్వ పాఠశాలలో కంటి వెలుగు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

గూడెం లిఫ్ట్ పైపులైన్‌కు మరమ్మతులు చేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్


రైతు దీక్షలో రఘునాథ్, నాయకులు

లక్సెట్టిపేట: పగిలిన గూడెం ఎత్తిపోతల పథకం పైప్‌లైన్‌కు మరమ్మతులు త్వరగా పూర్తిచేసి, కడెం ఆయకట్టుకు సాగునీరందించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ డిమాండ్ చేశారు. లక్సెట్టిపేట అంబేద్కర్ చౌరస్తాలో దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల బీజేపీ నాయకులు మంగళవారం చేపట్టిన రైతు దీక్షలో ఆయన పాల్గొన్నారు. గూడెం ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ తరచూ పగిలిపోతున్నాయన్నారు. వాటిని పూర్తిగా తొలగించి ఎమ్మెఎస్ పైపులు వేయాలని కోరారు. 2021లో అసెంబ్లీలో మంత్రి హరీశ్‌రావు చెప్పినప్పటికీ, వాటిని అలాగే ఉంచి, రైతులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. అనంతరం ఇరిగేషన్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వీరమల్ల హరిగోపాల్, బొప్పు కిషన్, గోపతి రాజయ్య, బొలిశెట్టి తిరుపతి, రజనీశ్ జైన్, పెద్దపల్లి పురుషోత్తం, మాధవరపు వెంకటరమణరావు, గాదె శ్రీనివాస్, గుండా ప్రభాకర్, బొప్పు సతీశ్, మోటపలుకుల తిరుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై దాడి చేసిన వారిని శిక్షించాలి


నిరసన తెలుపుతున్న నాయకులు

పాతమంచిర్యాల: నిజామాబాద్ జిల్లాలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కార్మిక, రైతు, సామాజిక సంఘాలు, ఉపాధ్యాయ సీఐటీయూ నాయకులు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సంకె రవి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దూర్కె మోహన్, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజవేణు, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మోతే జయకృష్ణ, ప్రధాన కార్యదర్శి అశంపల్లి రమేష్, సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి


22వ వార్డులో పర్యటిస్తున్న దివాకర్‌రావు

నస్పూర్: పట్టణంలోని పలు వార్డుల్లో మంగళవారం మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు పర్యటించారు. పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని 22వ వార్డులో రూ.14లక్షల సీఎస్ఆర్ నిధులతో చేపట్టిన కల్వర్టు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. సీసీసీ కార్నర్ వద్ద జాతీయ రహదారి విస్తీర్ణ పనులను పరిశీలించారు. మహాశివరాత్రి సందర్భంగా సీతారాంపల్లి గోదావరి నది వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ప్రభాకర్, వైస్ చైర్మన్ శ్రీనివాస్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

23 నుంచి కృత్రిమ అవయవాల పంపిణీ

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో ఈనెల 23 నుంచి 25 తేదీ వరకు దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాలు పంపిణీ చేస్తామని మార్వాడీ యువమంచ్ బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు అజయ్‌కుమార్‌లోయ, కార్యదర్శి కృష్ణకాంత్ సోనీ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మాట్లాడారు. పట్టణంలోని బాబు క్యాంపు బస్తీ హన్మాన్ మందిరంలో వైద్య శిబిరం జరుగుతుందని తెలిపారు. కృత్రిమ అవయవాలు కావాల్సిన దివ్యాంగులు ఈనెల 20 నుంచి పేరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. జైపూర్‌లో తయారు చేసిన కృత్రిమ అవయవాలను ఉచితంగా అందచేయడం జరుగుతుందని తెలిపారు. అంగవైకల్యం ఉన్నవారు ఆధార్ కార్డు జీరాక్స్ తోపాటు 2 పాస్‌పోర్టు సైజు ఫొటోలు, వైకల్యం కనిపించేలా ఫొటోలు తీసుకురావాలని సూచించారు. వివరాల కోసం 99667 98911, 93460 22166, 93912 22109 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు. సమావేశంలో మార్వాడీ యువమంచ్ కోశాధికారి కమల్ కిశోర్ లాహోటీ, నిర్వాహకులు బాలాప్రసాద్ మారు, అరవింద్ అగర్వాల్, రాజేశ్‌కార్వా, మనీష్ మారు పాల్గొన్నారు.

ఐక్యతతోనే అభివృద్ధి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రాజకీయాలకు అతీతంగా మున్నూరుకాపు కులబాంధవులు ఐక్యత సాధిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని, మున్నూరు కాపులు మరింతగా శ్రమించి సంఘాన్ని బలోపేతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ తెలిపారు. మంచిర్యాలలోని మున్నూరు కాపు సంఘం జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, మహిళా జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, నియోజకవర్గ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూముల నరేశ్, గౌరవ అధ్యక్షుడు బోయిని శ్రీనివాస్, ముఖ్య సలహాదారులు బొడ్డు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం మున్సిపల్ ఆఫీస్ ఎదుట ధర్నా


ధర్నా చేస్తున్న నాయకులు, గ్రామస్తులు

రామకృష్ణాపూర్: తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ తిమ్మాపూర్ గ్రామస్తులు మంగళవారం క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. వీరికి కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. తిమ్మాపూర్‌కు గత 15రోజులుగా నీటి సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నామని ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవటం లేదన్నారు. వెంటనే సమస్య పరిష్కరించకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పనాసరాజు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లెరాజు, ఉపాధ్యక్షుడు మేకల శ్రీనివాస్, గోపతి రాజయ్య, కొట్టె రాజయ్య, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాంపూర్ జీపీని సందర్శించిన డీఎల్‌పీవో


కార్యదర్శి, సర్పంచ్‌తో మాట్లాడుతున్న డీఎల్‌పీవో

జన్నారం: మండలంలోని రాంపూర్ గ్రామ పంచాయతీని మంగళవారం డీఎల్‌పీవో(డివిజనల్ పంచాయతీ అధికారి) ప్రభాకర్‌రావు పరిశీలించారు. పంచాయతీలోని పారిశుద్ధ్య కార్మికులు, గ్రామ కార్యదర్శి మధ్య విభేదాల వల్ల పనులు సక్రమంగా జరుగడం లేదనే విషయం తెలియడంతో ఆయన గ్రామ పంచాయతీలో సర్పంచ్ సులోచన, కార్యదర్శి వెంకటయ్యతో మాట్లాడారు. పారిశుద్ధ్య కార్మికులను పిలిచి వారి నుంచి వివరణ తీసుకున్నారు. ఇరువురి మధ్య విభేదాల కారణంగా పారిశుద్ధ్య పనులు జరగడంలేదని, పని చేయడం ఇష్టం లేకపోతే లిఖితపూర్వకంగా రాసిస్తే తగు చర్యలు తీసుకుంటామని డీఎల్‌పీవో వారికి సూచించారు. కొన్ని రోజులు పరిశీలించి, పనులకు రాకపోతే నోటీసులు పంపాలన్నారు. ఆయనతో ఎంపీడీవో అరుణరాణి, ఎంపీవో రమేశ్ ఉన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగుల సమ్మె నోటీసు

పాతమంచిర్యాల: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మార్చి 1, 2, 3తేదీల్లో సమ్మె చేస్తున్నట్లు అంగన్‌వాడీ ఉద్యోగులు తెలిపారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీడీ కార్యాలయంలో జిల్లా నోడల్ అధికారి హేమసత్యకు సమ్మె నోటీసు అందించారు. 40సంవత్సరాలుగా అంగన్‌వాడీ ఉద్యోగులుగా పనిచేస్తున్నామని, తమకు కనీస వేతనం, పెన్షన్, ఉద్యోగభద్రతను ప్రభుత్వం కల్పించలేదని వాపోయారు. ఇతర రాష్ట్రాల మాదిరిగా తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, పెన్షన్, బోనస్, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పలు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని నోడల్ అధికారి హేమసత్యకు అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు భానుమతి, నాయకురాలు శంకరమ్మ, రాధాబాయి, అనురాధ, రాజేశ్వరి, మహేశ్వరి, వెరోనిక, పుష్పలత, సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సద్వినియోగం చేసుకోవాలి

కోటపల్లి: మండలంలోని నక్కలపల్లిలో 60మంది లబ్ధిదారులకు మంగళవారం కోళ్ల పరిశోధన సంస్థ హైదరాబాద్ ద్వారా నాటుకోళ్లను, 5 కేజీల దాణా, నీటి పరికరాన్ని ఎంపీపీ మంత్రి సురేఖా పంపిణీ చేశారు. నాటు కోళ్లను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

ఘనంగా శ్రీ కృష్ణదేవరాయల జయంతి

చెన్నూర్: పట్టణంలోని ఉత్తర వాహిని కార్యాలయంలో అఖిల భారతీయ సాహిత్య పరిషత్ జిల్లా అధ్యక్షుడు దబ్బెట రాజమల్లు ఆధ్వర్యంలో శ్రీ కృష్ణదేవరాయల జయంతిని ఘనంగా నిర్వహించారు. చిత్ర పటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

భీమిని: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో ముఖ్యమని ఎస్సై సురేష్ అన్నారు. కన్నెపల్లిలో పలు కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కన్నెపల్లి మండలంలోని గ్రామపంచాయతీల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని సూచించారు. ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

వేమనపల్లి: మండల కేంద్రంలోని ప్రాణహిత పుష్కరఘాట్ రోడ్డు నిర్మాణానికి సీడీపీ నిధుల నుంచి రూ.10లక్షలు, గ్రామ పంచాయతీ నిధుల నుంచి రూ.6లక్షలతో పనులను ఎంపీపీ కోలి స్వర్ణలత, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వేణుమాదవ్ ప్రారంభించారు.

చెక్కులు పంపిణీ

భీమారం: స్థానిక బీఆర్ఎస్ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన పలువురికి సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన చెక్కులను మంగళవారం మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ రాజ్‌కుమార్‌నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు రాజ్‌కుమార్ పంపిణీ చేశారు.

రోడ్లకు మరమ్మతు చేయాలి

మందమర్రిరూరల్: మందమర్రి మార్కెట్ ఏరియాలోని రోడ్లు అధ్వానంగా ఉన్నాయని వెంటనే మరమ్మతు చేయాలని మందమర్రి మార్కెట్ వ్యాపారస్తులు పలువురు డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ గద్దె రాజుకు వినతిపత్రం అందించారు.

అభివృద్ధి ప్రణాళిక గ్రామసభలు

బెల్లంపల్లిరూరల్: మండలంలోని అంకుశం, కన్నాల గ్రామ పంచాయతీల్లో మంగళవారం గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక(జీపీడీపీ) గ్రామసభలు నిర్వహించారు.